క్లుప్తంగా

నాణ్యమైన విద్యనందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

రేగోడ్(మెదక్): విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించాలని ఎంఈఓ గురునాథ్ ఉపాధ్యా యులకు సూచించారు. మండలంలోని టి.లింగంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశలలో పలు రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు మీకు పాఠాలు సరిగా బోధిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత


ప్రభుత్వ పథకాలపై కళాకారుల ప్రదర్శన

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం, అప్పాజీపల్లి, ముప్పారం గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ పథకాలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై పాటలు పాడుతూ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శంకర్, కార్యదర్శి ప్రభకర్, కళాకారులు సిద్దులు, మాధవి, దేవదాస్, శేఖర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని సర్దన గ్రామానికి చెందిన సిద్ధయ్య, పోతరాజ్ సురేశ్ ఇటీవలే మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న లీల స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, నగదును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి తనవంతుగా సాయం చేసేందుకు ముందుకొచ్చి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాంచందర్, కిషన్, యాదగిరి, కిషన్, సురేశ్‌నాయక్ గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం అందించండి

శివ్వంపేట(నర్సాపూర్): హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందివ్వాలని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గూడూర్‌లోని కస్తూర్బా బాలికల హాస్టల్‌ని తనిఖీ చేశారు. వంటశాలతో పాటు రికార్డులను పరిశీలించి విద్యార్థులకు బోధన చేశారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక బోధన చేయాలని, చదువులో వెనుకబడిన వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మంజుల, తదితరులు ఉన్నారు.

ఆర్థికంగా ఎదగాలి

మనోహరాబాద్(తూప్రాన్): మహిళలు స్వయంకృషితో ఆర్థికంగా ఎదగడానికి మహిళా సమైఖ్య కృషి చేస్తోందని ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 30 మంది మహిళలకు లోకల్‌జాతికి సంబంధించిన 6 వారాల కోడి పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక కోడి పిల్ల రూ.110 ఉంటుందని, 680 కోడిపిల్లలను అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైఖ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మహిళ సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. శుక్రవారం చిన్నశంకరంపేట ఐకేపీ కార్యాలయం వద్ద మహిళా సంఘాల సభ్యులకు మహిళా శక్తి పథకం ద్వారా పేరటి కోళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఓ లక్ష్మీనారాయణ, సీసీలు పాల్గొన్నారు.

ప్రేమ, సేవ భగవంతుడి మార్గం

చిన్నశంకరంపేట(మెదక్): ప్రేమ, సేవ భగవంతుడి మార్గమని గ్రహించాలని మాధవనంద స్వామి సరస్వతి సూచించారు. శుక్రవారం మండలంలోని మిర్జాపల్లి గ్రామంలో వెలసిన శివపంచాయుత హనుమాన్ ఆలయం 13వ వార్షికోత్సవాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు అనిల్‌శర్మ, రామశర్మ ఆధ్వర్యంలో పూజలు, హోమం నిర్వహించారు.కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోతరాజ్ రమణ దంపతులు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, బైరయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

ఖర్చులను తగ్గించుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకొని ఆధునిక వ్యవసాయం చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ రాజ్‌నారాయణ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో సెహగల్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ యాంత్రికరణ ద్వారా రైతులు ఖర్చును, సమయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రవీణ్‌కుమార్, సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి గౌతమ్ పాల్గొన్నారు.

దిగుబడి రాకపాయె.. మద్దతు లేకపాయె!

- తెల్లబోతున్న పత్తి రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


పంట దెబ్బ తినడంతో దున్నేస్తున్న రైతు

కొల్చారం(నర్సాపూర్): పత్తి రైతులు దిగుబడి రాక, వచ్చిన పంటకు మద్దతు ధర లభించకపోవడంతో తెల్లబోతున్నారు. ఈ ఏడాది పత్తి సాగు చేసిన రైతులకు ఒకవైపు పెట్టుబడి డబ్బులు రాక.. మరోవైపు పంట సాగు కోసం అప్పు చేసిన డబ్బులు చెల్లించని పరిస్థితుల్లో విలవిలలాడుతున్నారు. వరి పంట సాగు చేసిన రైతులకు మద్దతు ధర ఇస్తున్న ప్రభుత్వం ఏదోరకంగా తమను ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మండల వ్యాప్తంగా వరి పంట 70 శాతం సాగు చేస్తూ వస్తున్న రైతులు, పత్తి పంటలో లాభాలు వస్తుండడంతో తెల్ల బంగారాన్ని కూడా సాగు చేస్తున్నారు. ఈసారి పంట వేసిన సమయంలో వాతావరణం అనుకూలంగా ఉండడం, వర్షం సైతం తోడవడంతో పంటకు డోకా లేదనుకున్నారు. వరుసగా కురిసిన భారీ వర్షాలతో చెట్టు నుంచి పూత రాలిపోయి చాలా ఎకరాల్లో పంట దెబ్బతింది. పత్తి తెంపే సమయానికి ఆశించిన స్థాయిలో దిగుబడి రాని పరిస్థితి నెలకొంది. ప్రతీ ఏడు రెండు నుంచి మూడుసార్లు పత్తి సేకరించేందుకు అవకాశం ఉండేది. దీంతో దిగుబడి కూడా వచ్చేది. ఈసారి మాత్రం ఒక్కసారి మాత్రమే పత్తి చేతికి రావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7వేల లోపే ధర పలకడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ దళారులకు పత్తిని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొంత మంది రైతులు ధర వస్తుందన్న గంపెడాశతో పత్తిని ఇళ్ల వద్ద, పొలాల వద్ద నిల్వచేసి ఉంచారు. ఒకేసారి పత్తి రావడంతో చేసేది లేక రైతులు పత్తి పంటను దున్నేస్తున్నారు. ఈసారి పత్తి సాగుతో అన్ని రకాలుగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సగానికి సగం పడిపోయింది

ఈసారి అర ఎకరం పొలంలో పత్తి సాగు చేశా. మొదట్లో పంట బాగానే ఉన్నా వర్షాలతో చాలా దెబ్బతింది. వచ్చిన పత్తిని అమ్ముకుందామంటే దగ్గర్లో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో తూకం ఎక్కువైనా ప్రైవేట్ వాళ్లకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఎప్పుడూ వచ్చే డబ్బుల కంటే సగానికి సగం కూడా రాలేదు.

– సత్తయ్య రైతు, పైతర

ఇంటిల్లిపాది కష్టపడినా పెట్టుబడి రాలేదు

పంట సాగు కోసం ఇంటిలిపాది కష్టపడ్డాం. ఆశించిన స్థాయిలో పంట పండక పోవడంతో పత్తిని కూడా కూలీలతో కాకుండా మేమే తెంపుకున్నాం. నాణ్యత లేదంటూ తక్కువ ధరకు పోయింది. ఒక్కసారి మాత్రమే కోత రావడం, చేసేది లేక దున్నేస్తున్నాం. ఏదో రకంగా పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

– కిషన్, రైతు, కోనాపూర్

రైతులకు అండగా ఉండాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైస్‌మిల్లు యాజమానులు రైతులకు అండగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన రైస్‌మిల్లును ప్రారంభించారు. అనంతరం ఆమె మండలానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మిల్లు యజమానులు విశ్వంభర, గోపాల్‌రెడ్డి, మాంతప్ప, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్, సొసైటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, రాజిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సాపూర్ రూరల్: అనారోగ్యాలతో ఆయా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురికి ఎమ్మెల్యే సునీతారెడ్డి నర్సాపూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి


గిరిజన తండాలో సామూహిక సీమంతాలు

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాళ్లపల్లితండాలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో నెలకు రెండు చొప్పున సామాజిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 6 నెలల దాటిన పిల్లలందరికీ తల్లిపాలతో పాటు బాలామృతం తినిపించాలన్నారు. మహిళల్లో రక్త హీనత నివారణ కోసం పాలు, ఆకుకూరలు, కోడిగుడ్లు తినాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సంతోష, టీచర్ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక కృషి అభినందనీయం


చెకుముకి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంఈఓ

- ఎంఈఓ తారా సింగ్

నర్సాపూర్ రూరల్: మూఢనమ్మకాల నివారణపై జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని నర్సాపూర్ ఎంఈఓ తారాసింగ్ అన్నారు. శుక్రవారం మండల స్థాయి చెకుముకి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి చిన్నప్పటి నుంచి ఆర్థిక, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు చెకుముకి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. మండలం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన తెలుగు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 75 మంది పాల్గొని పరీక్షలు రాయడం అభినందనీయం అన్నారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం షఫీయొద్దీన్, వేదిక మండల శాఖ అధ్యక్షుడు పండరి, ప్రధాన కార్యదర్శి రమేశ్‌రాజు, కార్యకర్తలు కిరణ్ కుమార్, శ్రీనివాసరావు, నాగరాజు గణేశ్ పాల్గొన్నారు.

కుంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సలాబత్‌పూర్ పంచాయతీ కొత్తపల్లిలో కబ్జాకు గురైన సాలెవాని కుంటను ఐబీ ఏఈ రవిమోహన్ శుక్రవారం పరిశీలించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో కబ్జా నుంచి కుంటను కాపాడండి అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. ఐబీ డిప్యూటీఈఈ జగన్నాథం ఆదేశాలతో ఏఈ రవిమోహన్ గ్రామానికి వెళ్లి కబ్జాకు గురైన సాలెవాని కుంటను పరిశీలించారు. గ్రామస్తులు, తండావాసులతో మాట్లాడి కొత్తగా బోర్‌వేసిన కుంట శిఖం భూమిని, వరి పంట సాగు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుంట శిఖం భూమి కబ్జా చేసి సాగు చేస్తున్నారని తెలిపారు. త్వరలో సర్వే నిర్వహించి కబ్జాలను తొలగిస్తామని చెప్పారు. చెరువు, కంటలు కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సన్మానం


అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ అదనపు కలెక్టర్ నగేష్‌ను మెదక్ జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ధనుర్మాస మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ ఉంటుందని, ముఖ్య అతిథిగా హాజరు కావాలని అదనపు కలెక్టర్‌ను ఈ సందర్భంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్, కాశీనాథ్, నరేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వితన దుకాణాల తనిఖీ

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు విత్తనాల దుకాణాలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, విత్తన దుకాణ యజమానులకు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని తెలిపారు. విత్తనాలు తీసుకున్న వారికి రసీదు కచ్చితంగా ఇవ్వాలని ఆదేశించారు. రోజువారి క్రయవిక్రయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రాజు, దుకాణ యాజమానులు రంజిత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బద్రియా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని బంజారానగర్‌లో తాగునీటి సమస్యతో ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్‌రెడ్డి శుక్రవారం తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాలో నీటి సరఫరా లేని కాలనీలకు తాత్కాలికంగా ఉదయం, సాయంత్రం ట్యాంకర్లతో నీటి సరఫరా చేయిస్తామన్నారు. తండాకు నీటి సరఫరా చేసే మోటార్ పాడైపోవడంతో దానిని వెలికి తీయించి మరమ్మతు పనులకు పంపించామన్నారు. త్వరలోనే మోటార్ రిపేరు చేయించి, శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కొత్త మోటార్ కొనడానికి ప్రస్తుతానికి నిధులు లేవన్నారు.


బద్రియా తండాలో పాడైపోయిన మోటార్‌ను వెలికి తీయిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్‌రెడ్డి

ఓటరు నమోదుపై బీఎల్‌ఓలకు అవగాహన


మాట్లాడుతున్న తహసీల్దార్

పెద్దశంకరంపేట(మెదక్): ఎన్నికల కమిషన్ ఆదేశాలతో 18 ఏళ్లు నిండిన యువతీయువకులకు ఓటరుగా నమోదు చేయించాలని బీఎల్‌ఓలకు తహసీల్దార్ గ్రేస్‌బాయి సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ నెల 23, 24న అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కును వివరించి, ఓటరుగా నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

విద్యార్థులను న్యాస్ పరీక్షకు సిద్ధం చేయాలి

- ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులను న్యాస్ (నేషనల్ అచీమెంట్ సర్వే) పరీక్షకు సిద్ధం చేయాలని ఎంఈఓ బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని తునికి ప్రాథమిక పాఠశాల ఇంగ్లీష్, ఉర్దు మీడియం విద్యార్థులను చదివించి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలని చెప్పారు. డిసెంబర్‌లో జరిగే న్యాస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన చేయాలని తెలిపారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గ్రేడ్లుగా విభజించి బోధించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ బాలరాజు

సన్నరకం వడ్లకు బోనస్

శివ్వంపేట(నర్సాపూర్): సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ సరస్వతి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్, ఎదుల్లాపూర్, చెన్నాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సన్నరకం వడ్లకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన 14 మంది రైతులకు సన్నధాన్యానికి సంబంధించి రూ.500 బోనస్ రూ.4,26,600 వారి ఖాతాల్లో జమ అయినట్లు మెసేజ్ కూడా వచ్చిందని చెప్పారు. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని సూచించారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని సకాలంలో తూకం వేసి, రైస్‌మిల్స్‌కు తరలించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.


తిమ్మాపూర్‌లో బోనస్ వచ్చిన రైతులతో మాట్లాడుతున్న అదనపు పీడీ సరస్వతి

90 శాతం సర్వే పూర్తి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో సుమారుగా 90 శాతం వరకు సమగ్ర కుటుంబ సర్వే పూర్తయిందని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని బండపోతుగల్‌లో గ్రామంలో సర్వే కొనసాగుతున్న తీరును పరిశీలించారు.

వివరాలు కంప్యూటరీకరణ

శివ్వంపేట(నర్సాపూర్): సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి వివరాలు కంప్యూటరీకరణ శుక్రవారం ప్రారంభించారు. ఎన్యుమనేటర్లు ఇళ్ల వద్ద సేకరించిన సమాచారాన్ని కంప్యూటరీకరణ చేశారు. 99 శాతం సర్వే పూర్తి చేశామని, మిగిలిపోయిన వారి వివరాలు శనివారం పూర్తి చేస్తామని ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెలఖరు వరకు పూర్తి చేస్తామన్నారు.

డేటా ఎంట్రీ పరిశీలన

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో సిద్దార్థ హై స్కూల్, ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియను ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డేటా ఎంట్రీ ఆపరేటర్లు తప్పులు లేకుండా ఆన్‌లైన్ ఎంట్రీ నిర్వహించాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజల వివరాలు గోప్యంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


శివ్వంపేట(నర్సాపూర్): ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

అనుమతులు లేని నిర్మాణాలు చేపట్టొద్దు


చందూర్‌లో ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ నిర్మాణాలను తీసేయిస్తున్న ఆర్‌ఐ వైదేహి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ వైదేహి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని చందూర్ గ్రామంలోని సర్వే నెంబర్ – 2లో అక్రమంగా నిర్మించిన గెదేల షెడ్లను కూల్చివేసి, నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలకు అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మిస్బావుద్దీన్, పంచాయతీ కార్యదర్శి జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దివ్యాంగులకు ఆరు వేల పింఛన్ ఇవ్వాలి**

అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు రూ.ఆరు వేల పింఛన్ వెంటనే ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం అల్లాదుర్గం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

◆ **చదువుతో మూఢనమ్మకాల నిర్మూలన**

టేక్మాల్(మెదక్): చదువుతో మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమని ఎస్ఐ రాజేశ్, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ అన్నారు. సీఐ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టేక్మాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్‌లో మహిళల రక్షణ– వ్యక్తిత్వ వికాసం– సైన్సు– మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్ మాంత్రికులు భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భరోసా కేంద్రం శ్రీలత, సౌమ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిలు, కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలమణి, పోలీస్ సిబ్బంది రామకృష్ణారెడ్డి, కృష్ణ, పాల్గొన్నారు.

◆ **ఉపాధి పనులపై గ్రామసభ**

కొల్చారం(నర్సాపూర్): గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రంగంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రియాంక అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్ గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ పోచయ్య, కృష్ణ, వెంకట్ గౌడ్, చందు, బాలరాజ్ పాల్గొన్నారు.

◆ **మున్సిపల్ అభివృద్ధే లక్ష్యం**

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారించడమే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ అన్నారు. మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 13వ వార్డులో పాత పంచాయతీ భవనం నుంచి వాటర్ ట్యాంకు వరకు విస్తరణ పనులతో పాటు సీసీరోడ్డు నిర్మాణం, 2వ వార్డులో వైకుంఠధామానికి గేటు ఏర్పాటుతో పాటు పలు కాలనీల్లో మురికి కాల్వల పైకప్పుల నిర్మాణ పనులు చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కమిషనర్ గణేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **కళాశాలలో పిచ్చి మొక్కల తొలగింపు**

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కాకతీయ సేవా పథకం కింద శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ అధ్యక్షుడు డా. హుస్సేన్ సలహాతో వాలంటీర్లు కళాశాల పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ నిర్వాహణాధికారి వెంకటేశ్వర్లు, లెక్చరర్ గణపతి, డా.మల్లేశం, రాజాగౌడ్, సురేందర్‌రావు పాల్గొన్నారు.

◆ **ధ్వజస్తంభం ఊరేగింపు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట, గూడూర్ గ్రామాల్లో శుక్రవారం రాత్రి రాతి ధ్వజస్తంభాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

◆ **కిరాణం షాపులో చోరీ**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేటగేట్ వద్దగల కిరాణం షాపులో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ. 5వేలు నగదు, కిరాణం సామగ్రి దొంగిలించారు. శుక్రవారం బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రాజిపేట గ్రామానికి చెందిన వీరేశంగుప్తాకు వెంకట్రావ్‌పేటగేట్ వద్ద డబ్బాలో కిరాణం షాపు ఉంది. రోజుమాదిరిగా గురువారం రాత్రి షాపుకు తాళం వేసి వెళ్లాడు. ఉదయం వచ్చిచూడగా.. డబ్బా వెనక భాగంలో రేకువంచి ఉందన్నారు. లోపలికి వెళ్లిచూడగా గల్లాపెట్టెలోని రూ. 5వేలు నగదుతో పాటు కిరణాసామగ్రి చోరీ అయినట్లు తెలిపారు. ఈవిషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

◆ **కూతురితో తండ్రి అసభ్యకర ప్రవర్తన**

టేక్మాల్(మెదక్): కూతురితో అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజేష్ కథనం మేరకు.. టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కూతురితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని తల్లికి చెప్పినా తండ్రి ప్రవర్తినలో ఎటువంటి మార్పు రాలేదు. ఏదో ఒక విధంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. తన తండ్రిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కూతురు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.